వేడుకగా శ్రావణ పూజలు


పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

కీసర: కీసరగుట్టలోని భవానీ రామలింగేశ్వర స్వామికి శ్రావణ మాసోత్సవాల ప్రత్యేక పూజలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం అర్చకులు విశేష పూజలను నిర్వహించారు. గర్భాలయంలో కొలువైన స్వామి వారికి మహా న్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. పంచామృత, ఫలరసాభిషేక పూజల్లో ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం పాల్గొన్నారు. అనంతరం స్వామివారి పల్లకీ సేవలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఈఓ సుధాకర్‌రెడ్డి, అర్చకులు రవిశర్మ, బల్‌రాంశర్మ తదితరులు తెలిపారు.

ముగిసిన తైక్వాండో పోటీలు


తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన జవహర్‌నగర్ విద్యార్థులు

జవహర్‌నగర్: ఆత్మరక్షణ కోసం విద్యార్థులు చిన్నప్పటి నుండే తైక్వాండో నేర్చుకోవాలని మాస్టర్ నరేందర్‌యాదవ్ అన్నారు. ఎదులాబాద్‌లో సోమవారం నిర్వహించిన ఫస్ట్ ఓపెన్ తెలంగాణ తైక్వాండో చాంపియన్‌షిప్ క్రీడా పోటీల్లో మాస్టర్ నరేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో జవహర్‌నగర్‌కు చెందిన విద్యార్థులు బంగారు, వెండి పతకాలు సాధించారు. నిత్య మహాలక్ష్మి, రేవంత్‌గౌడ్, ప్రవీణ్, బాలశివప్రసాద్‌లు బంగారు పతకాలు, నైనా, సాక్షి, ఐశ్వర్య, యోజిత్, వీరబ్రహ్మస్వామి, సాయితేజు, మహేష్, కార్తికేయ, శివకుమార్, ప్రమోద్‌లు వెండి పతకాలు సాధించారు. అనంతరం విద్యార్థులను జవహర్‌నగర్ ప్రజలు అభినందించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి రెండవ వార్డుకు చెందిన నరేష్‌కు మెరుగైన వైద్యం కోసం రూ. 12 వేలు మంజూరైంది. ఇందుకు సబంధించిన చెక్కును మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సోమవారం తన నివాసంలో నరేష్‌కు అందజేశారు. గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు మండల రవికుమార్, వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి నిధులివ్వాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయించాలని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వజ్రేష్‌యాదవ్‌కు మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రాన్ని సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... పట్టణంలో రైల్వే వంతెన పనులు జరుగుతుండటంతో రోడ్డును మూసివేశారన్నారు. దీంతో తాత్కాలికంగా నారాయణ గార్డెన్ నుంచి లక్కీ వైన్స్ వరకు ప్రస్తుతం రాకపోకలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆ రోడ్డులో గుంతలో ఏర్పడటంతో రాకపోకలకు ఇబ్బందులు నెలకొంటున్నాయి. ఈ నేపథ్యంలో రోడ్డు పనులకు నిధులు మంజూరు చేయించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయనను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మశ్చేందర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ నాగరాజుముదిరాజ్, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులుయాదవ్, నర్సింగ్‌రావు, సిరాజ్, మున్సిపల్ ఏఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

డ్యూటీకని వెళ్లిన యువకుడి అదృశ్యం

మల్కాజిగిరి: డ్యూటీకని ఇంటి నుంచి బయలుదేరిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. మల్కాజిగిరి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం... ఇందిరా నెహ్రూనగర్‌కు చెందిన జంగటి నవీన్(29) ఫ్లిప్‌కార్ట్ ఉద్యోగి. ఈ నెల 21వ తేదీన డ్యూటీకని ఇంటి నుంచి హోండా యాక్టివాపై బయలుదేరాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతోపాటు సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో బంధువులను ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. నవీన్ తండ్రి జావేద్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్రపు డెక్కను పూర్తిగా తొలగిస్తాం


గుర్రపు డెక్కను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: సఫిల్‌గూడ చెరువులో గుర్రపుడెక్కను పూర్తిగా తొలగించడానికి చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. సోమవారం ఆయన చెరువును పరిశీలించారు. చెరువులోకి మురుగునీరు వస్తున్నదని జోనల్ కమిషనర్ రవికిరణ్, డీఈ మహేష్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ మురుగునీరు చేరుతుండటం వల్లే గుర్రపుడెక్క విస్తరిస్తోందని, దీంతో దోమల బెడద, దుర్వాసన వేధిస్తున్నాయని అన్నారు.

అంబరాన్నంటిన శ్రీకృష్ణ జన్మాష్టమి
సంబురాలు


మేడ్చల్ ఇస్కాన్ ఆలయంలో ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు


చీర్యాల లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు


మేడ్చల్ ఆలయంలో భక్తుల రద్దీ


హోలీ ఫెయిత్ స్కూల్‌లో...

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని హరే కృష్ణ సత్సంగ్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సవాలు నిర్వహించారు. డబీల్‌పూర్‌లోని ఇస్కాన్ ఆలయంలో ప్రత్యేకంగా జన్మాష్టమి వేడుకలను నిర్వహించారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. జన్మాష్టమి సందర్భంగా తల్లిదండ్రులు తమ పిల్లలను రాధాకృష్ణులుగా అందంగా తయారు చేసి మురిసిపోయారు. పలు ప్రాంతాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమాలను ఏర్పాటు చేసి సందడి చేశారు.

ఘట్‌కేసర్ పరిధిలో...

ఘట్‌కేసర్: కృష్ణాష్టమి సందర్భంగా పట్టణంలోని హోలీ ఫెయిత్ గ్రామర్ హైస్కూల్, ఎన్ఎఫ్‌సీనగర్ స్మార్ట్ ఏంజెల్ స్కూల్, గీతామందిర్‌లో రాధాకృష్ణులకు విశేష పూజలు నిర్వహించారు. హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తనం, గోపాల కృష్ణుడి ఉయ్యాల సేవ, పంచామృత అభిషేకం, భాగవత పారాయణం, భజన, క్షీరాభిషేకం తదితర పూజలను నిర్వహించారు. చిన్నారులు చిన్ని కృష్ణులు, గోపికల వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో హోలీ ఫెయిత్ స్కూల్ కరస్పాండెంట్ జితేందర్‌రెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

చీర్యాల లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో....

కీసర: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా చీర్యాల లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో స్వామివారికి అర్చనలను నిర్వహించారు. అనంతరం వివిధ రకాల ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. కీసర యాదవ సంఘం, నాగారం సెరినిటీ పాఠశాల, కీసర అరుంధతీ పాఠశాల్లో కృష్ణాష్టమి వేడుకలను కనులపండువగా నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో ఆకట్టుకున్నారు. ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరిగౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అరుంధతి పాఠశాలలో...


నాగారం సెరినిటీ పాఠశాలలో...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: పూడూర్ సబ్‌స్టేషన్ మల్లన్న ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొన్ని ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. పూడూర్ గ్రామంతో పాటు పరిశ్రమలకు, వ్యవసాయ కనెక్షన్లకు సరఫరా ఉండదని ఏఈ వివరించారు.

29న క్రికెట్ సెలక్షన్స్

మేడ్చల్: మేడ్చల్ జోనల్ క్రీడల్లో భాగంగా క్రికెట్ జట్టుకు క్రీడాకారుల ఎంపిక కోసం ఈ నెల 29న సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు జోనల్ క్రీడల కార్యదర్శి వెంకటనారాయణ తెలిపారు. మేడ్చల్ జోనల్‌లోని మేడ్చల్, దుండిగల్ మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను అండర్-14, అండర్-17 విభాగాల్లో ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. మేడ్చల్‌లోని కేఎల్ఆర్ కాలనీలోని క్రికెట్ ఎరినాలో సెలక్షన్స్ నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు బొనొఫైడ్, ఆధార్ కార్డు, ఫొటోలతో హాజరు కావాలని కోరారు.

పేకాట స్థావరంపై దాడి: 12 మంది అరెస్టు

జవహర్‌నగర్: పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేసిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... జవహర్‌నగర్ కార్పొరేషన్ అరుంధతీనగర్‌లోని అటవీ ప్రాంతంలో 12 మంది గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న మల్కాజిగిరి ఎస్‌వోటీ, జవహర్‌నగర్ పోలీసులు ఆ స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న నవీన్‌రెడ్డి, ముత్యాల శివకుమార్, చింతల శ్రీనివాస్‌రెడ్డి, పబ్బు శ్రీకాంత్, వక్కంటి శ్రీనివాస్‌రావు, కిందరి మల్లేష్, ఎండీ.ఇమ్రాన్, ఎం.డి.కాశీమ్, పెద్దాపురి రాజు, చిలుకల మణికంఠ, ఇల్లూరి వెంగల్‌రెడ్డి, వంగరి బాబులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 1,90,600, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గణేష్ మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి


మాట్లాడుతున్న కుషాయిగూడ ఏసీపీ మహేష్

కుషాయిగూడ ఏసీపీ మహేష్

కీసర: గణేష్ మండపాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీసుల నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని కుషాయిగూడ ఏసీపీ మహేష్ పేర్కొన్నారు. సోమవారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సుర్వీబాబయ్య ఫంక్షన్ హాల్‌లో కీసర ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... నాగారం మున్సిపాలిటీతోపాటు కీసర మండలంలోని వివిధ ప్రాంతాల్లో గణేష్ మండపాలను ఏర్పాటు చేసుకునే వారు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలన్నారు. మండపం ఏర్పాటు మొదలుకొని విగ్రహాల నిమజ్జనం వరకు ఉత్సవ కమిటీ సభ్యులు బాధ్యతగా మెలగాలన్నారు. విద్యుత్‌శాఖ నుంచి తప్పకుండా అనుమతి తీసుకోవాలన్నారు. పోలీస్‌శాఖ ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ యాప్‌లో దరఖాస్తు చేసుకొని అనుమతి తీసుకోవాలన్నారు. నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, విద్యుత్ ఏఈ మురళీకృష్ణ, దమ్మాయిగూడ, నాగారం, కీసర వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నియామకం

ఘట్‌కేసర్: ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎదులాబాద్ గ్రామానికి చెందిన ఎదుగని శ్రీరాములు నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరప్ప, దివాకర్ నగరంలోని కార్యాలయంలో ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ... ఓబీసీల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సందానందరాజ్, కార్యదర్శి గుండ్ల ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.


నియామక పత్రం అందుకుంటున్న శ్రీరాములు

గుండ్ల చెరువును కాపాడాలని ధర్నా

కీసర: జవహర్‌నగర్ చెత్తడంపింగ్ యార్డు నిర్వహణ చేపడుతున్న రాంకీ సంస్థ సమీపంలోని గుండ్ల చెరువును పూర్తిగా కబ్జా చేసిందని జేఏసీ ఆరోపించింది. హైడ్రా అధికారులు స్పందించి ఈ చెరువును కాపాడాలని డిమాండ్ చేసింది. జవహర్‌నగర్ చెత్త డంపింగ్‌పై పోరాటం చేస్తున్న జేఏసీ ఆధ్వర్యంలో హరిదాస్‌పల్లి సమీపంలో జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. జేఏసీ ధర్నాకు బీజేపీ నేత ఏనుగు సుదర్శన్‌రెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జవహర్‌నగర్ డంపింగ్ యార్డు వల్ల సమీపంలోని దమ్మాయిగూడ, నాగారం, జవహర్‌నగర్ ప్రాంతాల్లో నివసిస్తున్న లక్షలాది మంది ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాంకీ సంస్థ డంపింగ్ యార్డు సమీపంలో సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గుండ్ల చెరువును పూర్తిగా కబ్జా చేస్తూ డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న వ్యర్థ జలాలను చెరువులోకి వదిలిపెట్టడంతో చెరువు పూర్తిగా కలుషితంగా మారిపోయిందన్నారు. గతంలో ఇక్కడి నుంచి ఎంపీగా గెలుపొందిన ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే డంపింగ్‌యార్డును ఇక్కడి నుంచి తరలిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. సీఎం తన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.


ధర్నాకు మద్దతు తెలుపుతున్న బీజేపీ నేత సుదర్శన్‌రెడ్డి తదితరులు

పోలీసులు ప్రజల మధ్య మంచి వాతావరణం ఉండాలి


వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఏసీపీ రాములు

శామీర్‌పేట్: పోలీసులు ప్రజల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాలని పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు అన్నారు. శామీర్‌పేట పోలీసుల ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల యువకులతో సోమవారం నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌ను ఏసీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా పోలీసుల ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామని, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని అన్నారు. మేమంతా చిన్ననాటి నుంచి క్రీడల్లో పాల్గొన్న వారిమేనని, మిమ్మల్ని చూస్తుంటే బాల్యం నాటి రోజులు గుర్తుకు వస్తున్నాయని ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ అన్నారు. ఈ టోర్నీలో 18 జట్లు పాల్గొన్నాయన్నారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఎస్ఐలు మునీందర్, పరుశరాం, దశరథ్, హారిక తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో మంగళవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్నట్లు కమిషనర్ రామలింగం వెల్లడించారు. ఉదయం 7.30 నుంచి 9.30 గంటల వరకు 1, 4, 6, 13, 17, 18, 23 డివిజన్ల పరిధిలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్ హాజరవుతున్నట్లు ఆయన వివరించారు.

కాలుష్యపు కోరల్లో చెరువులు, కుంటలు...
నివారణ చర్యలు చేపట్టరా?

- వ్యర్థాల చేరికతో రంగు మారుతున్న నీరు
- కలుషితం అవుతున్న భూగర్భ జలాలు
- ఆందోళనలో పరీవాహక ప్రాంతాల ప్రజలు

మేడ్చల్: మేడ్చల్ నియోజకవర్గం పరిధిలోని చెరువులు, కుంటలు కాలుష్యపు కోరల్లో చిక్కుకుంటున్నాయి. పరిసర ప్రాంతాల నుంచి వచ్చే డ్రైనేజీ నీరు ఆయా చెరువులు, కుంటల్లోకి చేరి అందులోని నీటితోపాటు భూగర్భ జలాలను సైతం కలుషితం చేసేశాయి.

◆ చెరువుల, కుంటల ఆక్రమణలపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా కొరడా ఝులిపిస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో కలుషి నీటితో నిండిన చెరువుల ప్రక్షాళన ఏమిటనే ప్రశ్నలు వెల్లువెత్తున్నాయి. చెరువులు, కుంటలను ఆక్రమించి పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్‌లు, వెంచర్లు ఏర్పాటు వెలుస్తున్నాయి. వాటి నుంచి వస్తున్న మురికి నీరు చెరువుల్లోకి చేరుతోంది. దీంతో అందులోని నీరుకాస్తా పూర్తిగా కలుషితం అవుతున్నాయి.

◆ మేడ్చల్, గుండ్లపోచంపల్లిలో ప్రధానంగా చెరువులు, కుంటలు పూర్తిగా కలుషితం అవుతున్నాయి. మేడ్చల్‌లోని తుమ్మచెరువు, గుండ్లపోచంపల్లిలోని నీళ్ల చెరువు, నారం చెరువు, కండ్లకోయలో పోల్కమ్మ కుంట మురుగునీరుతో పూర్తిగా కలుషితం అవుతున్నాయి. ఈ నాలుగు కుంటలు నివాస ప్రాంతాల మధ్యలో ఉన్నాయి. కుంటలకు పై భాగాన కాలనీలు, అపార్ట్‌మెంట్‌లు ఉండటంతో కుంటల్లోకి మురికి నీటిని వదిలిపెడుతుండటమే కాలుష్యానికి కారణం.

చెరువుల్లోకి చేరుతున్న మురుగునీరు...

మేడ్చల్ పట్టణంలోని తుమ్మ చెరువు కింది భాగం సగం పట్టణం, పై భాగానా 10 వరకు కాలనీలు ఉన్నాయి. పై భాగంలో ఉన్న కాలనీల నుంచి మురుగునీరు సరైన డ్రైనేజీ వ్యవస్థ లేనందున చెరువులోకి వచ్చి చేరుతున్నాయి. కండ్లకోయలోని పోల్కమ్మ కుంట గ్రామం ముందు ఉంది. ఓ వైపు కళాశాలలు, ఇళ్లు ఉండటంతో అక్కడి మురుగు నీరు కుంటల్లో చేరుతుంది. గుండ్లపోచంపల్లిలోని నీళ్ల చెరువు గ్రామ శివారులో ఉంది. పొలాలు, అపార్ట్‌మెంట్‌లు ఉండటంతో చెరువు మురుగుమయంగా మారింది. మున్సిపల్ కార్యాలయం ముందు ఉన్న నారం చెరువులోకి డ్రైనేజీ నీరు వదులుతుండటంతో చెరువు పూర్తిగా కాలుష్యమైంది.


తుమ్మ చెరువు ఒడ్డున చెత్త

కంపుకొడుతున్న కుంటలు...

చెరువులు, కుంటలు మురుగునీరుతో పూర్తిగా కలుషితం కావడంతో వాటిగుండా వెళ్తే చాలు కంపుకొడుతున్నాయి. చెరువులలో మురుగునీరు చేరడంతోపాటు బాధ్యత లేకుండా వ్యర్థాలు, చెత్తలు వేస్తుంటడంతో అంతా మురుగుమయంగా మారి ముక్కుపుటాలు అదిరేలా దుర్వాసనలు వస్తున్నాయి. ఆహ్లాదం కోసం చెరువు దగ్గరకు వెళితే ముక్కు మూసుకోవాల్సి వస్తోందంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలుషితం అవుతున్న భూగర్భ జలాలు...

చెరువులు, కుంటల కింద పంటల సాగు లేదు. దీంతో అందులోని నీరు వాటి సమీపంలో ఉండే కాలనీల్లోని భూగర్భ జలాలను కలుషితం చేస్తున్నాయనడం నిర్వివాదాంశం. ఇలా భూగర్భ జలాలు సైతం కలుషితం అవడంతో బోర్లలోంచి వచ్చే నీరు ఇంటి అవసరాలకు ఉపయోగించలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు.

రంగు మారుతున్న నీరు...

కుంటలలోకి మురుగునీరు చేరి కలుషితం కావడంతో నీరు పూర్తిగా రంగుమారిపోతున్నాయి. మురుగు నీరు, చెత్త అధికం కావడంతో కుంటలలోని నీరు ఆకుపచ్చ రంగులోకి మారిపోతున్నాయి. నీరు రంగు మారడంతో పాటు గుర్రపుడెక్క విపరీతంగా పెరగడంతో దోమల బెడద ఎక్కువగా మారింది.


ఆకుపచ్చ రంగులోకి మారిన మేడ్చల్ తుమ్మ చెరువు నీరు


గుండ్లపోచంపల్లి నీళ్ల చెరువు ఇలా...